# కాలమ్ దాటని కథ

ధనుంజయరావు. జనార్దనరావు వేరు వేరు పార్టీల నాయకులు.

మూడో పార్టీని ఎలక్షన్లలో ఈజీగా ఓడించేందుకు అలయన్సు కుదుర్చుకోవడం కోసం చర్చించారు. కానీ ఒక్క స్థానంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

ఆ ఒక్క సీటులో అలయన్సు కుదర లేదని ప్రక్క రోజు పేపర్లంతా గోల చేశాయి. ధనుంజయరావు ఎలాగైనా ఆ సీటు సంపాదించాలనుకొన్నాడు.

అనుకొన్న ప్లాన్ ప్రకారం డాక్టరు కోర్సు చదివిన కొడుకును తీసికొని జనార్దనరావు ఇంటికెళ్ళాడు పెళ్ళి చూపుల కని.

జనార్దనరావుకు ముప్పయిఏళ్ళ పెళ్ళికాని కూతురుంది. కొంచెం లావుగా ఉన్నందున ఇంతవరకు పెళ్ళి ఘడియ రాలేదామెకు.

"పిలిచి అబ్బాయినిస్తామంటే అంతకంటే ఏం కావాలి! మరి కట్నం విషయాలు...."




అన్నాడు జనార్దనరావు.

"అబ్బే కట్నం వద్దులేండి బావగారు. ఆ సీటుకు మీ పార్టీ అభ్యర్థిని బెట్టకండి. అంతే చాలు" అన్నాడు ధనుంజయరావు.

"కావాలంటే పది లక్షలు కట్నం తీసుకోండి. ఆ సీటులో మేం తప్పక గెలుస్తాం. కాబట్టి ఆ సీటుని వదిలేది లేదు" అన్నాడు జనార్దనరావు.

"అయితే ఈ మ్యారేజ్ అలయన్సు కూడా వద్దు. మా పార్టీ అభ్యర్థిని నిలబెడతాం" అంటూ వెళ్ళిపోయాడు ధనుంజయరావు.

ఆ తర్వాత ఎలక్షన్లు వచ్చాయి.
ఫలితాలు వెలువడ్డాయి.
రెండు పార్టీలూ ఓడిపోయాయి.
ఇద్దరూ ఏడ్చారు.
కూతురు పెళ్ళి కాలేదనికాదు.
పది లక్షలు కట్నం పోయినందుకుకాదు.
ఆ స్థానంలో ఓడిపోయినందుకు.

—గుంపర్తి శ్రీనివాసమూర్తి

# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వారపత్రిక

# 1985 ఉగాది నవలల పోటీ

తెలుగులో కొత్తదనంతో కూడిన మంచి నవలలు రావాలనే ఆసక్తితో పాఠకుల సౌకర్యార్థం వారి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా నవలల పోటీని నిర్వహిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. కొత్తతరం పాఠకులకి, రచయిత(త్రు)లకి ఈపోటీ ప్రోత్సాహకరంగా ఉంటుందని, లబ్ధప్రతిష్ఠులతోపాటు కొత్తతరం నవలా రచయిత(త్రు)లు కూడా ఉత్సాహంతో పాల్గొని మా ప్రయత్నం విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాము. ఈ ఏడాది పోటీలో ఒకే ఒక నవలకు రు. 5000/-లు బహుమతి ఇవ్వాలని నిశ్చయించాము.

ఈ పోటీలో ఉత్తమ సస్పెన్స్ థ్రిల్లర్ నవలను కొత్తగా ఇందు కోసం రాసినవి రచయిత(త్రు)ల నుంచి ఆహ్వానిస్తున్నాము. పాఠకులు హెచ్చు ఉత్కంఠతో చదివే నవలలను ఆదరిస్తున్నారని గ్రహించి అటువంటి నవలా రచనను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పోటీ నిర్వహిస్తున్నాము. తెలుగు రచయిత(త్రు)లు ఈ అవకాశాన్ని వినియోగించుకొంటారని ఆశిస్తున్నాము.

## ఉత్తమ సస్పెన్స్ థ్రిల్లర్ ఒకే నవలకు
## బహుమతి రూ. 5,000/-

## నిబంధనలు

1) పోటీకి పంపే నవలలు ఫుల్‌స్కేప్ కాగితాలలో 150. 200 పేజీల మధ్య 200 పేజీలకు మించకుండా ఉండాలి.
2) కాగితానికి ఒక ప్రక్కనే సిరాతో స్పష్టంగా రాయాలి.
3) అనువాదాలు, అనుకరణలు పంపకూడదు.
4) పాఠకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని బహుమతి పొందినవిగాక ఒకటి రెండు నవలలను సాధారణ ప్రచురణకు స్వీకరించే అవకాశం వుంది.
5) కవరుపైన "ఉగాది సస్పెన్స్ థ్రిల్లర్ నవలల పోటీకి" అని స్పష్టంగా రాయాలి.
6) అంగీకరించని వాటిని తిప్పి పంపడానికి వీలుగా తగినంత పోస్టేజి అతికించిన చిరునామా ఉన్న కవరు విడిగా రచనతోపాటు జతచేసి పంపాలి.
7) నవలల పోటీ ఫలితాలు మా సచిత్ర వారపత్రిక క్రోథన ఉగాది సంచిక 29-3-85లో ప్రకటిస్తాము. బహుమతి ఫలితాలను గురించి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరుపబడవు.
8) నవలల ఎన్నిక విషయంలో తుది నిర్ణయం సంపాదకునిదే. మీ నవలను—

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, పోస్టుబాక్సు నెం. 712,
విజయవాడ—520 010 కి పంపాలి.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ : 6-3-1985.**

—ఎడిటర్